# చిట్టికథ




ఓనాటి అమావాస్య రాత్రి బుచ్చిబాబుకి జీవితంలో మర్చిపోలేని రాత్రి. ఆ రాత్రి పన్నెండు గంటలకు బుచ్చిబాబు మంచి నిద్రలో వున్నాడు. తలుపు టక టకమని శబ్దం. విసుగ్గా వెళ్ళి తలుపు తీశాడు. ఓ చక్కని చిన్నది. తెల్లటి చీర జాకెట్, పెద్దకళ్ళు, పెద్దవాల్జడ-మెళ్ళో చైన్, తల్లో మల్లె పూలతో నిలబడివుంది.

"ఎవరో రౌడీలు నన్ను తరుముకొస్తున్నారండి. ఈ వూరు నాకు కొత్తండి. ట్రెయిన్ లేటుగా వచ్చింది. ఈ చీకటిలో మా మావయ్యగారిల్లు కనుక్కోలేక పోయాను. స్ట్రయిక్ వల్ల రిక్షాలు లేవు. ఈ రాత్రికి మీరు ఆశ్రయం యిచ్చారంటే ఉదయాన్నే వెళ్ళిపోతాను. ఈ ఒక్క సహాయం చెయ్యండి. మీ మేలెన్నటికీ మర్చిపోను." అని ఆమె దీనంగా బ్రతిమలాడింది.

బుచ్చిబాబు కెంతో జాలేసింది. "అదెంత భాగ్యం! రండి. కష్టంలో ఆదుకోకపోతే యెందుకీ మానవజన్మ? మానవసేవే మాధవ సేవన్నారు కదండీ పెద్దలు."

"ఇంట్లో మీరొక్కరే వున్నట్లుందే? నాకు చాలా ఆకలేస్తూందండీ."

అలా ఆమె అడగడమే తడవుగా "యిక్కడ దగ్గర్లో హోటలుంది. బిరియాని తెస్తాను." అని హ్యాంగర్‌కుండే షర్టు తీసి వేసుకొన్నాడు.

"అబ్బే మీకెందుకండీ శ్రమ. డబ్బులిస్తాను రెండరటిపండ్లు తెండి చాలు." అని వాలుచూపులు విసిరింది. బుచ్చిబాబు ఒళ్ళంతా జివ్వుమంది.

"నోనో యీ రాత్రి మీరు నా గెస్ట్. నా ఆతిథ్యం స్వీకరించాలి. ఇదిగో యీ పుస్తకం చదువుతూండండి. మా ఆవిడ అన్నమైనా మానేస్తుంది గాని పుస్తకాలు మాత్రం చదవకుండా వుండదు. ఆవిడ పురిటికెళ్ళింది లెండి. మీకాకలిగా వుంది కదూ పాపం! పదినిమిషాల్లో వచ్చేస్తా. అఁ మేడమ్! మీ పేరడగలేదు, మీ పేరేమండి?" అని లవ్లీగా అడిగాడు.

ఆమె సిగ్గు నటిస్తూ "నన్నందరూ మిస్ అంటారండీ!" అంది ముద్దుగా.

"చూడండి మిస్! జాగ్రత్తగా తలుపేసుకోండి." బుచ్చిబాబు మనసు గాలిలో తేలిపోతూంది. సినీమా హీరోలా యీల వేసుకొంటూ తన సెకండ్ హ్యాండు సైకిల్‌మీద హోటలు వైపు దారి తీశాడు.

చికెన్ బిరియాని, ఓ డజను అమృతపాణి అరటిపండ్లు, స్పెషల్‌కిళ్ళీ తీసుకొని పదిహేను రూపాయల బిల్లు చెల్లించి మిస్‌ను తల్చుకొంటూ యింటికి తిరిగి వచ్చాడు. సైకిల్ స్టాండు వేసి బ్యాక్‌పాకెట్‌లో వుండే దువ్వెన తీసి స్టైయిల్‌గా తల దువ్వుకొని, మిస్ తలుపు తట్టినట్లే టకటకామని తలుపుమీద కొట్టాడు. తలుపు తట్టీతట్టక ముందే రెండు తలుపులూ తెరుచుకొన్నాయి. ఇంట్లో మిస్‌లేదు! సరికదా యెదురుగా టేబిల్‌పై ఉగాదికి మామగారు ఆరువందల రూపాయలకొన్ని యిచ్చిన ట్రాన్సిస్టరు రేడియో లేదు. బీరువా తెరచి వుంది. అందులో తన శ్రీమతి దుర్గ పెళ్ళి చీరలు (రెండు వేల రూపాయలు), వాయిల్ చీరలు ఒక్కొక్కటి యాభై రూపాయలు తక్కువుండదు. అవి హోటల్‌కెళ్ళే తొందర్లో వాచ్ చేతికి పెట్టుకొని వెళ్ళలేదు. అదీ తన నాలుగు జతల టెరికాటన్ గుడ్డలు ఒక్క మిస్ కోసం యీ వస్తువులన్నీ మిస్ చేసుకొన్నట్టుతెలుసుకొన్నాడు! అప్పుడు గుర్తు కొచ్చింది పురిటికెళ్ళిన తన అర్ధాంగి-పాపం బుచ్చిబాబుకి.

ఆడది కనబడ్తే భార్యను, యింటిని, తన సంస్కారాన్నీ అన్నింటినీ మర్చిపోయి తన మనస్సునే మిస్ చేసుకొని యెంత నష్టపొయ్యాడో పాపం బుచ్చిబాబు! బియ్యే.

ఇంతలో టేబిల్‌మీద చిన్న కాగితం రెపరెపలాడుతూ కన్పించింది. దానిమీద "నా పేరు మిస్ కాదు. నీలాంటి మగవాళ్ళను ఫూల్స్ చేసి మిస్ కావడం నా హాబీ. చూడండి మిస్టర్! నా లాంటి స్త్రీలు చాలమంది వుంటారు. ఇకనైనా జాగ్రత్తగా వుండండి. ఇంకావంటింట్లో సామానూ, టేబుల్‌ఫ్యానూ వున్నాయి. ఐనా ఇవి చాలు నాకు. బై బై తెచ్చిన బిరియాని భోంచేసి మీ అర్ధాంగిని తల్చుకొంటూ నిద్రపోండి. నన్ను తల్చుకోకండి. మరలా యేమైనా మిస్ అవుతారు.

ఇక వుంటాను,

'మిస్....'

ఆ ఉత్తరం చదివి ఏం చెయ్యడానికి తోచక కొయ్యబారి నిలుచుండిపోయాడు పాపం బుచ్చిబాబు!

— యమ్.అనూరాధ